# ఇదీ దారిద్ర్యమేనా

శ్రీలత వాకిట్లో కుర్చీలు వేసుకొని స్నేహితులతో మాట్లాడుతున్నది. అందరి చేతుల్లోనూ గోల్డుస్పాట్ సీసాలున్నాయి. గ్రామాలలో పిల్లల సంఖ్య ఎంతఉన్నదో, వాళ్ళ పరిస్థితులేమిటో - తల్లిదండ్రుల రాబడి ఎంతో తెలుసుకోవ టానికి నలుగురు సభ్యుల చంతున నాలుగు గ్రూపులు క్లబ్బువైపునుంచి మరో రెండు రోజుల్లో బయలుదేరబోతున్నాయి.

శ్రీలత క్లబ్బుకు సెక్రెటరీ. ఈ క్లబ్బు అఖిలభారత మహిళాసభకు ఒక శాఖ. ఆమె చైల్డుకౌన్సిలు వారి సూచనల ననుసరించి తమ క్లబ్బువైపునుంచి ఈ కార్యక్రమము నిర్వహిస్తోంది. పదహారు మంది నాలుగు గ్రూపులుగా ఏర్పడ్డారు. అందుకు ఖర్చులకొరకు చైల్డు కౌన్సిలు చెక్కు పంపింది ఏ గ్రూపు ఏ గ్రామం వెళ్ళవలసిందీ చెప్తోంది శ్రీలత సభ్యులకు.

అది వేసవికాలం. సాయంత్రం కాగానే చల్లగాలికి బయటికి రావాలనిపించే వేళ.

సరళ గేటులోపలికి వచ్చింది. నిలబడ్డది.

మెంబర్లందరూ కబుర్లలో మునిగి ఆమెను చాలాసేపు చూడనే లేదు. కొంతసేపటికి శ్రీలత అటూఇటూచూస్తూ సరళను చూసి "ఏంకావాలమ్మా! ఎవరుమీరు ?" అడిగింది లేచివచ్చి.

"మీ పేరు విని చాలాదూరంనుంచి వచ్చాను. మీతో కొంచెం మాట్లాడా లమ్మా" చేతులు నలుపుకొంటూ నిలబడ్డది.

"చెప్పండి"

"నాలుగు నెలలనుంచి మా వారికి జబ్బుగా ఉంది. మందు తీసుకుంటు న్నారు. సెలవుమీద ఉన్నారు. కనుక నెలనెలా జీతం రావటంలేదు. పిల్ల

వాడికి కాలేజి ఫీజు కట్టాలి. పరీక్షలు దగ్గరకొచ్చాయి. నూట ఏభయి రూపా యల కోసం నాలుగు రోజులనుంచీ తిరుగుతున్నాను ఫీజు కట్టవలసిన ఆఖరుతేది ఎల్లుండి. డబ్బులేక ఈ నాలుగు నెలలనుంచీ చిన్నపిల్లల చదువు మాన్పించాను. ఈ ఒక్కడి చదువయితే ఏచిన్న ఉద్యోగమో చూసుకుంటాడు. సంసారానికి కాస్త ఆసరా కలుగుతుంది.

''బాగా చదువుతున్నాడా ? మార్కులు బాగా వస్తున్నాయా ?''

''మార్కులు బాగా వస్తున్నాయమ్మా. మా ఆశలన్నీ వాడిమీదనే.''

''సమయానికి మా మెంబర్లందరూ ఇక్కడే ఉన్నారు. ఎవరికి తోచింది వాళ్ళిస్తారు. అడుగుతాను." అంటూ తనకుర్చీ దగ్గరికి వెళ్ళింది.

''ఫ్రెండ్స్, ఇప్పుడు మీరంతా మీ వితరణబుద్ధిని ప్రకటించే అవకాశం వచ్చింది. పాపం ఈమె కొడుకు పరీక్షఫీజు కట్టాలట. ఫీజుకట్టే సమయం సమీపించిందట. డబ్బు సహాయం కావాలట. మీరంతా మీకు చేతనైనంత సహాయం చేయండి." అంటూ శ్రీలత అందరి ముందర చేయిచాపింది.

శ్రీలత అంతటివ్యక్తి అడగటమే ఘనంగా భావించి మెంబర్లందరూ ఐదులు పదులు ఇచ్చారు వాటికితోడుగా శ్రీలత ఒక పది కలిపి లెక్కబెట్టింది. నూట పాతిక రూపాయలు సరళచేతిలో పెడుతూ "మీరంతదూరంనుంచి వచ్చి అడిగి నందుకు ఇంతమాత్రం వసూలయింది. తీసుకవెళ్ళండి." అన్నది.

మరునిముషంలో వాళ్ళ కబుర్లు చదువులమీదికి మళ్ళాయి. 'ఇటువంటి పిల్లలకు చదువు ఆగిపోకుండా ఉండాలంటే ప్రభుత్వం కాలేజి విద్యకూడా ఉచితం చెయ్యాలి ''

''ప్రభుత్వం స్కాలర్‌షిప్పులు ఇస్తున్నది కదా !"

''అది మెరిట్ స్కాలర్‌షిప్పు''

"ఆ స్కాలర్‌షిప్ మెరిట్ కమ్‌మీన్స్ అయిఉండాలి"

''పేదవాడికి చదువుకునే అవకాశాలు అంటే పుస్తకాలు కొనుక్కోవటానికి డబ్బులేకపోవచ్చు. ఇంటిపనులవల్ల తీరుబడి లేకపోవచ్చు. జబ్బు పడవచ్చు.

ఈ కారణాలచేత మార్కులు సరిగారావు. అప్పుడు మీన్సులేక మెరిట్ లేక వాడి చదువు ఆగిపోతుంది. అందుకని ఉచితవిద్య కావాలంటాను.''

''అవునండి మార్కుల ప్రసక్తిలేకుండా పేదవారు చదువు సాగించే అవకాశాలుండాలి. ఆర్థికంగా వెనకబడిన వాళ్ళకు తప్పకుండా ఉండాలి.''

"ఏదో కొద్దిచదువు ఉంటే దానికి తగిన సంపాదన ఉంటుంది. లేకపోతే మనదేశంలో దారిద్ర్యమెక్కువయి పోతుంది."

''ఇంత పెద్దదేశంలో దారిద్ర్యాన్ని నిరక్షరాస్యతను రూపుమాపాలంటే కనీసం ఒక శతాబ్దము పడుతుంది.''

చాలా సేపు ఎవరికితోచిన మాటలు వాళ్ళు మాట్లాడుతూ నవ్వుతూ తుళ్లుతూ ఇళ్లకు చేరుకున్నారు.

సరళ ఒక కవరులో డబ్బుపెట్టుకుని బస్సులు రెండుమారి అలకాపురి స్టాపులో దిగి ఇంటికివెళ్ళింది. పొద్దునచేసిన వంటకాలున్నాయి. స్టౌవెలిగించి అన్నం వండింది. ముగ్గురు పిల్లలు ఒక్కసారి భోజనానికి రావటం అపురూపం. పిల్లలతో తనుకూడా భోజనం చేసి పడుకుంది.

ఆమె ఆలోచిస్తోంది. మూడు కాలనీలకు వెళ్ళి పిల్లవాడి ఫీజుకు డబ్బులు వసూలు చేసింది. మొత్తమెంతయిందో లెక్కపెట్టాలని లేచి చూసింది. అంతా కలిపి పదితక్కువగా మూడువందలరూపాయలు అయింది. వాటిని పెట్టె అడుగున జాగ్రత్తగా దాచింది. ''ఈ రోజుల్లో ఐదువందలయినా పెట్టనిదే మామూలు పట్టుచీరకూడా రావటంలేదు. మరో పదిరోజులు పోయాక ఇంకేదో సాకు చెప్పి, మరొక కాలనీకి వెళ్ళాలి" అనుకుంటూ పక్కమీదికి వాలింది.

ఆఫీసునుంచి శాయిరాం అంచెలంచెలుగా బస్సులు మారుకుంటూ ఇంటికి వచ్చేసరికి రాత్రి పదిగంటలు దాటుతుంది. అందుకే అందరు ''భోజనాలు చేయండి'' అంటాడు. అతడు వచ్చి తలుపు తట్టగనే సరళ లేచి తలుపుతీసింది.

"ఇవాళకూడా జీతం ఇవ్వలేదా'' కోటందుకుంటూ అడిగింది.

''అది ప్రయివేటు కంపెనీ, నెలమొదటి వారంలోనే జీతాలివ్వాలంటే

ఇవ్వరు. ఇచ్చినప్పుడు తీసుకోవాలి'' అతడు భోజనంచేసి పడుకున్నాడు. సరళకు అసంతృప్తి కలిగింది.

శాయిరాం ఒక కంపెనీలో పనిచేస్తాడు. ఆఫీసు దూరమని ఏడుగంటలకే బయలుదేరుతాడు. ఆఫీసుకు దగ్గరగా రెండు ఇళ్ళల్లో ట్యూషన్లు చెబుతాడు. తొమ్మిది గంటలకు ఆఫీసుకు చేరుకుంటాడు. అతడికి ఆఫీసు పనులు చేయటమంటే అతి చురుకుదనం వస్తుంది. తడుముకోడు. అధికారి కనుసన్నలలో మెలగుతాడు. పనిలో వంక పెట్టటానికి వీలులేదు. కనుక అతడంటే అధికారికి గౌరవం. అక్కడ అందరూ అతడిని అనుసరించుకొని తిరుగుతారు. సలహాలడుగుతారు నౌకర్లుకూడా అతడు చెప్పినది ముందు చేస్తారు.

కాని -

అతడు ఆఫీసునుంచి వేళకు బయలుదేరుతాడు గాని ఇల్లు చేరడు. తిన్నగా స్నేహితుడింటికి వెళ్ళి మూడుముక్కలాట ఆడతాడు. ఆ ఆటలో అతడు నిపుణుడు. అందరినీ ఓడిస్తాడు. తోటివాళ్ళను గెలువనివ్వడు. అతడిచేతిలో ఉన్న మాయను ఎవరూ తెలుసుకోలేరు. ఎప్పుడూ అతడు ఎందుకు గెలుస్తాడో ఎవరికి తెలియదు. డబ్బు కచ్చితంగా తీసుకుంటాడు.

అక్కడి నుంచి బయలుదేరి దారిలో వెంకటేశ్వర స్వామి ఎదుట సాగిలపడి చెంపలు వేసుకొని ఇంటిదారి పడతాడు. ఆ కాలనీ మలుపుతిరిగేచోటనే బారు ఉంది. అక్కడ రెండుపెగ్గులు సేవించి నెమ్మదిగా నడచి ఇంటికివస్తాడు. భోజనం ఎట్లఉన్నా తిని పడుకుంటాడు.

అతడి దినచర్యలో మార్పు ఎప్పుడూ ఉండదు. అతడు నెలకొకసారి గుఱ్ఱపు పందేలకు వెళతాడు. అందరినీ ఆఫీసులో మెప్పించినవాడు - మూడుముక్కలాటలో ఎన్నడూ ఓడిపోనివాడు-ఇక్కడ మాత్రం ఒక్కసారయినా గెలుపొందలేదు.

ఆ రోజు పెద్దకొడుకు శివా లెక్చెరరు భుజంగం దగ్గరకెళ్ళి "సర్ నేనింకా ఫీజు కట్టలేదు రేపు కట్టకపోతే నన్ను పరీక్షకు కూర్చోనివ్వరు. మీరు కొంచెం సహాయం చెయ్యండి సర్. స్టాఫుచేతకూడా చేయించండి. ఈపరీక్షలయిన తరువాత నేను ఏదో ఒక ఉద్యోగం చేసుకోవాలి మానాన్న హాస్పిటల్లో ఉన్నాడు.

సర్. ఇంట్లో తమ్ముళ్ళూ చెల్లెళ్ళూ - సంసారం గడవటమే కష్టంగా ఉంది సర్. ఒకపేద విద్యార్థిమీద కనికరం చూపండిసర్." అని ప్రాధేయపడ్డాడు.

కాలేజి లెక్చెరరుకు ఫీజు కట్టకపోతే విద్యార్థిని పరీక్షకు కూర్చోనివ్వరని తెలుసు. కాని "ఇప్పుడు అడుగుతున్నా వేమిటోయ్ ? అందులో నెలాఖరులోనా అడగటం ? అడిగావు కనుక నా దగ్గరున్నదేదో ఇస్తాను. అందరూ స్టాఫ్ రూములో ఉన్నారు. వెళ్ళి అడుగు" ఐదు రూపాయలు చేతిలో పెట్టాడు.

శివా అందరి దగ్గరా అడిగి మొత్తం నలభయి రూపాయలు మాత్రమే సంపాదించ గలిగాడు. సెలవుల్లో ఆఫీసర్ల ఇళ్లకు వెళ్ళి వేసుకోవటానికి బట్టలు లేవని అడుగుతాడు. కొందరు డబ్బిస్తారు. బట్టలు కొందరు పాత విస్తారు.

శివా తరువాత పదిహేడు పదమూడేళ్ల పిల్లలు. వాళ్ళు హైస్కూల్లో చదువుతున్నారు. ఆ స్కూల్లో పిల్లలు తప్పటం అంటూ ఉండదు పదోక్లాసు వరకు నరహరి తొమ్మిదవ క్లాసు. మనిషి ఏపుగా పెరిగాడు. అతడు చదువులో అంతగా ఇష్టం చూపించడు. కాని అతడిది ప్రత్యేకమైన శైలి, ఇంట్రవల్లో అందరితోపాటు క్లాసురూములో నుంచి బయటికి వెళ్తాడు. వెళ్ళినట్టేవెళ్ళి ఎప్పుడో వస్తాడు, ఒకరిబ్యాగ్‌లోనుంచి పెన్సిలు, ఒకరి బాగ్‌లోనుంచి నోట్ బుక్, ఇంకొకరి బాగ్‌లోనుంచి టెక్స్టుబుక్ తీసుకుంటాడు. స్కూలు ఫీజు కట్టాలని కొందరు డబ్బు తెచ్చుకుంటారు. లంచ్ అవర్లో కట్టవచ్చని బైటికి వెళ్లుతారు. నరహరి దానిమీద కన్నువేసి వాళ్లురాకముందే మాయం చేస్తాడు. మళ్ళీ బైటికి వెళ్ళి అందరితోపాటు కబుర్లాడుతూ లోపలికి వస్తాడు.

పాపం వస్తువులుపోయిన పిల్లలు టీచర్లదగ్గరికి వెళ్ళి కంప్లైంటు చేస్తారు. వాళ్ళెంత ప్రయత్నించినా దొంగ దొరకడు.

నరహరికి ఇది అంత లాభంగా కనపడలేదు. చదువులో అతడి శక్తి ఎంతో అతడికి తెలుసు. అందుకే అతడు స్కూలువేళకు ఇంట్లోనుంచి వెళ్తాడు. దారిలో లాండ్రీలో మంచి బట్టలుచూసి అద్దెకు తీసుకుంటాడు. అవి వేసుకొని హుందాగా అద్దె స్కూటరుమీద రిక్షావాళ్ళ దగ్గర చిట్టీలు వేస్తాడు. "మీరంతా వారానికింతని డబ్బుకట్టండి. నెలనెలకూ వడ్డీతెచ్చి ఇస్తాను అసలు డబ్బు కావాలంటే పాట ఎక్కువపాడి తీసుకోండి. చివరకు అంటే ఏడాదికి తీసుకుంటే

అసలుడబ్బు వస్తుంది. ఏడాది పొడుగునా వడ్డీవస్తుంది. వాళ్ళందరికీ ఈ పథకం నచ్చుతుంది. అతడిని మెచ్చుకుంటారు. ధర్మరాజు అంటారు. ఇలా డబ్బు చేతులు మారుస్తూ ఉంటాడు. అతడి చేతిలోనూ డబ్బు మెదులుతుంది. అటు రిక్షావాళ్లకూ లాభం ఇటులాండ్రివాళ్ళకు లాభం. రెండు మూడేళ్ళయిన తరువాత డబ్బు చేతబట్టుకొని కనబడకుండా పోతాడు. ఊళ్ళు మారుతూ ఉంటాడు.

మురారి చదివేది ఏడోక్లాసు. మంచి మాటకారి. ఉపాయశాలి. అతడికి స్నేహితులెక్కువ. కాని ధనికుల పిల్లలను చూసి చూసి స్నేహం చేస్తాడు. వేళకు ఒక స్నేహితుడింట్లో ఉంటాడు. "పాఠాలు చదువుదాంరా"అని అతడిని పిలిచి గదిలోకి వెళ్తాడు. అతడి పుస్తకాలతో గబగబా చదువుకుంటాడు. నోట్సు రాసుకుంటాడు అందుకు అతడి కలం కాగితాలు ఉపయోగించుకుంటాడు.

"ఏమిట్రా స్కూలుకు వేళయింది. ఇట్లాంటి వేషంతో వచ్చావు. స్కూలుకు రావా ?'' అంటాడు స్నేహితుడు.

''ఇవాళ టెస్టు ఉంది. నీకు ఆసంగతి తెలియదేమోనని చెప్పాలని వచ్చాను. ఇక్కడే వేళయింది. మా యిల్లు దూరమని తెలుసుగా. ఏం చేస్తాం, ఇవాళ్టికి ఇంతే."

''అయ్యయ్యో నాకోసం ఇంతదూరం వచ్చావు. నీవు భోజనంలేకుండా ఈ బట్టలతో స్కూలుకు వస్తే నాకు బాధగా ఉండదూ ! నాతో భోజనం చెయ్యి నా బట్టలువేసుకో. నా లూనా మీద పోదాం రా" అంటాడు. స్నేహితుడు.

"నాకు చాలాముఖమాటంరా ఎవరింట్లోనయినా భోజనం చెయ్యాలంటే, పైగా నీవు బట్టలు కూడా వేసుకోమంటున్నావు. నాకు ఎట్లాగో ఉంటుంది."

''అబ్బా ఇవాళ్టికి నామాట వినరా ప్లీజ్. నీవెప్పుడోగాని మాయింటికిరావు నీవంటి స్నేహితుడొక్కడున్నా చాలు." ఈ విధంగా పదిహేను రోజులు గడుస్తాయి. తరువాత మళ్ళీ మొదటికి వస్తాడు.

ఆ వేషం ఆ ఠీవి ఆ తెలివి అతడి స్నేహితులలో ఎవరికి లేదు, అతడిని వాళ్లెవ్వరు వదలిపెట్టరు.

చిత్రమేమిటంటే ఆయింట్లో తల్లిదండ్రులు పిల్లలనుగాని - తల్లిదండ్రులు వాళ్ళలో వాళ్ళుగాని - పిల్లలు ఒకరితో ఒకరుగాని వాళ్ళ జీవిత విధానాలను గురించి ప్రశ్నించుకోరు. తెలుసుకోవాలని కూడా అనుకోరు. అందరు హాయిగా రోజులు గడుపుతూ ఆ వాడలో గౌరవంగా బతుకుతున్నారు.

వాళ్ళ జీవితాలలో దారిద్ర్యమెక్కడా కనబడదు. కాకపోతే...........